క్లుప్తంగా

దెందులూరు ఆర్‌ఓగా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి



దెందులూరు: దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గం సాధారణ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌గా ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ బీ.లావణ్యవేణి నియమితులయ్యారు. గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి ఎం.ముఖేష్ మీనా ఈ మేరకు లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు.

రెండు కోళ్ల వ్యర్థాల వాహనాలు సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న కోళ్ల వ్యర్థాల వాహనాలు

పెదపాడు: మండలంలోని పెదపాడు నుంచి వీరమ్మకుంట వైపుకు కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న రెండు వాహనాలు సీజ్ చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పెదపాడు మండలంలోని వీరమ్మకుంట గ్రామానికి రెండు ఐసర్ వాహనాలతో కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వాహనాలను అడ్డుకుని సీజ్ చేసినట్లు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు. దీనికి సంబంధించిన యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు పెదనిండ్రకొలనులో గడపగడపకు కార్యక్రమం

నిడమర్రు: మండలంలోని పెదనిండ్రకొలను గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం (187వ రోజు) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు హాజరై, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను లబ్ధిదారులకు వివరిస్తారన్నారు. గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకూ అధికారులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంకు పెద్దఎత్తున ప్రజా ప్రతినిధులు, వైసీపీ శ్రేణులు హాజరుకావాలని సత్యకుమార్ కోరారు.

ఉండ్రాజవరం రోడ్డుకు మోక్షం



అధ్వాన్నంగా ఉన్న ఉండ్రాజవరం రోడ్డును జేసీబీతో రిపేరు చేయిస్తున్న ఎంపీటీసీ నరేష్

దెందులూరు: మండలంలోని ఉండ్రాజవరం రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు ఛిద్రమైంది. స్పందించిన ఎంపీటీసీ సున్నా నరేష్ తన వంతు బాధ్యతగా జేసీబీ తీసుకువచ్చి గోతులు పూడ్చి, మెరకలు సరిచేయించడం పనులను గురువారం ప్రారంభించారు. రెండు రోజుల్లో ఉండ్రాజవరం రోడ్డు ప్రయాణికులు, వాహనదారులకు తాత్కాలికంగా ఇబ్బంది లేకుండా తన సొంత ఖర్చులతో రిపేరు పనులు చేయిస్తున్నట్లు తెలిపారు.

తల్లిపాలపై అవగాహన

పెదపాడు: తల్లిపాలు పిల్లలకు అందించడం ద్వారా పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని సూపర్‌వైజర్ ఫాతిమా తెలిపారు. మండలంలోని పెదపాడులో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడం ద్వారా తల్లికి బిడ్డకి కలిగే ప్రయోజనాలు వివరించారు. బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఆరు నెలలలోపు తల్లిపాలనే అందించాలని ఎలాంటి అనుబంధ ఆహారాన్ని ఇవ్వరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి అరుణాదేవి, ఏఎన్ఎం రత్నకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశాలు గర్భవతులు, బాలింతలు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

వ్యాయామ కళాశాలకు ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందించిన వెంకన్న బాబును సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ డా.నత్తానియేల్

దెందులూరు: మండలంలోని వంగవీటి మోహనరంగా యువసేన గోపన్నపాలెంలో దూర ప్రాంతం నుంచి విద్యనభ్యసిస్తున్న యూజీడీ, బీపీఈడీ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు రూ. 5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తానియేల్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, నేతల అభిమానులు, విద్యార్థుల అభివృద్ధికి ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. అనంతరం దాత ఏనుగు వెంకన్నబాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీడీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

- ఎటుచూసినా జ్వర పీడితులు, కండ్ల కలక బాధితులే
- ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక ఫీవర్ వార్డు ఏర్పాటు



కండ్ల కలక సమస్యతో ఆసుపత్రికి వచ్చిన బాలుడికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మాధవి

పెదవేగి : సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఎక్కడ చూసినా జ్వరం, కండ్ల కలక సమస్యలే ఎక్కువగా కన్పిస్తున్నాయి. ఇవే ప్రస్తుతం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వైరల్ వ్యాధులు. వర్షాలు విపరీతంగా పడడంతో వాతావరణంలో మార్పులు వచ్చి జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. వీటి నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వాసుప్రతులతో పాటు స్థానికంగా ఉండే పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను అప్రమత్తం చేసింది. రోగులు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా వారికి అవసరమైన అన్నిరకాల వైద్య సదుపాయాలు సమకూర్చుతోంది.

రోజూ 700 మంది వరకూ రోగులు

దెందులూరు నియోజకవర్గంలో ప్రభుత్వాసుపత్రికి నిత్యం వచ్చే రోగుల సంఖ్య 600 నుంచి 700 వరకూ ఉంటోంది. వీరిలో ఇతర వైద్య చికిత్సలకు వచ్చే వారి మినహా మెడికల్ ఓపీ 200 మంది వరకూ వస్తున్నారు. వీరిలో జ్వర పీడితులు 40 నుంచి 50 మంది ఉంటున్నారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహించిన రోజుకు 10 నుంచి 20 మందిని ఇన్ పేషంట్లుగా ఆసుపత్రిలో చేర్చుకుని వైద్య చికిత్సలు అందిస్తున్నారు.

ప్రత్యేక ఫీవర్ వార్డు

జ్వర పీడితుల సంఖ్య అధికంగా ఉండడంతో ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక ఫీవర్ వార్డు ఏర్పాటు చేశారు. మగవారికి 20 బెడ్లు, ఆడవారికి 10 బెడ్లు ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు. 24 గంటలూ పూర్తిస్థాయి వైద్య చికిత్సలు అందించే విధంగా వైద్యులు, సిబ్బందికి డ్యూటీలు వేశారు. అలాగే ఆసుపత్రి, పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో పూర్తిస్థాయి మందులను అందుబాటులో ఉంచారు.

అధిక సంఖ్యలో కండ్ల కలక బాధితులు...

కండ్ల కలకతో బాధపడుతూ ఆస్పత్రికి వస్తున్న వారి సంఖ్యలో పెరుగుతోంది. వీరి సంఖ్య నిత్యం 50కి పైగా ఉంటోందని ప్రభుత్వాసుపత్రి వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి రాకుండా ముందుగా అప్రమత్తంగా వ్యవహరించాలి. ఈ కేసులు రోజురోజుకీ గణనీయంగా పెరుగుతున్నాయి. దీనికి కారణం ఇది ఒకరి నుంచి మరొకరి సోకుతుంది. చాలా మంది కండ్ల కలక అంటే వెంటనే కళ్లను నీటితో కడుక్కుంటుంటారని అయితే దానితో పాటు ముఖ్యంగా చేతులను తరచూ నీటితో, శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.

జ్వరాన్ని నిర్లక్ష్యం చేయకండి

జ్వరం బారిన పడిన వారి సంఖ్య రోజురోజుకి పెరుగుతోంది. ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య ఆదే రీతిలో ఉంది. వైరల్ జ్వరాల నేపథ్యంలో ఆసుపత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశాం. 24 గంటలూ పర్యవేక్షణ చేస్తున్నాం. రోగులకు అన్ని రకా ల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. జ్వరం పూర్తిగా తగ్గితేనే ఇంటికి పంపిస్తున్నాం. ప్రజలు జ్వరాలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలి.

– డాక్టర్ మాధవి, ప్రాథమిక వైద్యశాల పెదవేగి

జగనన్న భూసర్వేపై అవగాహన సదస్సు



పెదపాడు గ్రామసచివాలయం- 2లో రీసర్వేపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెదపాడు: ప్రతీ గ్రామంలో డ్రోన్స్, కార్స్, రోవర్‌లు ఉపయోగించి సర్వే టీమ్ సభ్యులతో భూ స్థితి నిజ నిర్ధారణ చేసి రెవెన్యూ రికార్డులు తయారు చేయబడతాయని మండల సర్వేయర్ పీ కోదండరామ్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఆర్ నాగరాజు తెలిపారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంపై పెదపాడు గ్రామ సచివాలయం-2లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడారు సర్వే పూర్తి అయిన తర్వాత ప్రతీ ఆస్తికి శాశ్వత హక్కు పత్రం అందించడం జరుగుతుందన్నారు. గ్రామ నాయకులు కొత్తూరు విమలారావు, వీఆర్వోల నటరాజన్ దాసు, కోటేశ్వరరావు గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ ధనుంజయరావు

దెందులూరు: మండలంలో అన్ని గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు అన్నారు. గురువారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత అన్ని శాఖల అధికారులు విద్య, రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయం, అభివృద్ధి తదితర అంశాలపై శాఖాపరమైన ప్రగతిని వివరించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలపై తీర్మానాలు చేశారు. గృహ నిర్మాణ శాఖ డివిజనల్ ఇంజనీర్ ధనుంజయరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతుందని, ప్రాథమిక దశలో ఉన్న లబ్ధిదారు లంతా త్వరగతిన పూర్తిచేసేలా ప్రజాప్రతినిధులు తమవంతు సహాయసహకారాలు అందించాలన్నారు. కార్యక్ర మంలో మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, గొల్ల నాగరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

లయన్స్ సేవలను విస్తృత పర్చాలి



భీమడోలులో నూతన కార్యవర్గ సభ్యులచే ప్రమాణం చేయిస్తున్న కాకరాల వేణుబాబు

భీమడోలు: డైమండ్స్ లయన్స్ సేవా దృక్పథంతో పని చేయాలని డైమండ్స్ లయన్స్ క్లబ్ ఫస్ట్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కాకరాల వేణుబాబు అన్నారు. భీమడోలు రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం రాత్రి లయన్స్ క్లబ్ భీమడోలు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. అధ్యక్షునిగా బొబ్బా రమేష్, కార్యదర్శిగా ఈతకోట సత్యకృష్ణ, కోశాధికారిగా మామిళ్లపల్లి కృష్ణ కుమారిలతో పాటు సభ్యులచే జిల్లా ప్రతినిధి ఎల్.వెంకటేశ్వరరావు ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు విద్య వైద్య సదుపాయాలను అందించేందుకు తమ సేవా సంస్థ పని చేస్తుందన్నారు. లయన్స్ విధి విధానాలను పాటించి జిల్లా స్థాయిలో భీమడోలు గుర్తింపు పొందాలన్నారు. పలు సంఘాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. లయన్స్ సేవలను మరింత విస్తృత పర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ప్రతినిధులు తుమ్మల ఉమామహేశ్వరరావు, సత్యేంద్ర, యలమర్తి రవీంద్ర, గురజాల రాంబాబు, సభ్యులు కనుమూరి లీలా కృష్ణ, చీమకుర్తి మురళీ, పోశింసెట్టి మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

కొవ్వలిలో ఉన్నత పాఠశాల ప్రాంగణం తనిఖీ



ఉన్నత పాఠశాలలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఇంటర్ బోర్డు రీజనల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ బీ. ప్రభాకరరావు

దెందులూరు: మండలంలోని కొవ్వలి ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని ఏపీ ఇంటర్ బోర్డు ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ బీ. ప్రభాకర్ గురువారం తనిఖీ చేశారు. దెందులూరు మండల విద్యాశాఖాధికారి ఎవీఎస్‌వీ ప్రసాద్, కొవ్వలి ఉన్నత పాఠశాల ఎస్ఎస్‌వీఎస్‌జీ శర్మలు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఆదర్శ దాత, విద్యావేత్త వెలమాటి చంద్రశేఖర జనార్ధనరావు కొవ్వలి ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు చేస్తున్న కృషి ఆదర్శనీయమన్నారు. కోట్ల రూపాయలతో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కొవ్వలి ఉన్నత పాఠశాలను తీర్చిదిద్దారన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఏలూరు వెళ్లకుండా స్వగ్రామంలోనే సౌకర్యవంతంగా విద్యనభ్యసించేలా దూరదృష్టితో కళాశాల ఏర్పాటుకు స్థలం దానం చేశారన్నారు. ఇంటర్మీడియట్ తరగతుల నిర్వహణకు అవసరమైన తరగతిగదులు, మరుగుదొడ్లు, ఆట స్థలం, దాత నిర్మించిన అదనపు తరగతి గదులను రీజనల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ ప్రభాకరరావు తనిఖీ చేశారు.

పింఛన్ అందజేత



కొవ్వలిలో డయాలసిస్ బాధితురాలికి పింఛన్ అందజేస్తున్న దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్ తదితరులు



డయాలసిస్ బాధితురాలికి రూ.10 వేల పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ తాతా రమ్య, గ్రామ నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పింఛన్ పంపిణీ కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది. బుధవారం అందుబాటులో లేనివారికి గురువారం పింఛన్లు అందజేశారు. - దెందులూరు, పెదవేగి

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

గణపవరం: మండలంలోని ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈనెల 4వ తేదీ శుక్రవారం ఉదయం 10గంటలకు గణపవరం మండలం డి.కుముదవల్లి, ఏ.గోపవరం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు వైఎస్సార్ జగనన్న కాలనీ ఇంటి స్థలం పట్టాలను ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పంపిణీ చేస్తారు. అదే విధంగా 11 గంటలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణపోషణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలంతా పాల్గొనాలని క్యాంపు కార్యాలయం ప్రతినిధి అడబాల రవి తెలిపారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకూ మేలు

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- కైకరంలో గడపగడపకు మన ప్రభుత్వం



కైకరంలో గడప గడపకు మనప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు మేలు చేకూరేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే పుప్పాలవాసుబాబు అన్నారు. గురువారం ఉంగుటూరు మండలం కైకరం పడమట వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ వలంటీరు వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎంతోమేలు జరుగుతోందన్నారు. అన్ని శాఖలకు చెందిన ఉద్యోగులను సచివాలయంలో ఉంచి పాలన గ్రామస్థాయికి తీసుకువచ్చిన గొప్ప ఆలోచనపరుడు జగన్ అని అన్నారు. వలంటీరు వ్యవస్థ ద్వారా ఇంటికే పెన్షన్ అందించటంతో వృద్ధులు, ఒంటరి మహిళలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. విద్యకు 66 లక్షల కోట్లు రూపాయలు వెచ్చించి విప్లావాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారని అన్నారు. పేదల పిల్లలు విద్యలో రాణించినపుడు సామజిక మార్పు వస్తుందని బావించిన సీఎం జగన్ విద్యకు పెద్ద పీట వేశారన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలని వాసుబాబు కోరారు. వైసీపీ మండల కన్వీనర్ మరడమంగరావు, ఎంపిపి గంటాశ్రీలక్ష్మి, జెడ్పీటిసి కొరిపల్లి జయలక్ష్మి, పుప్పాలగోపి, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడరమావతి, ఎంపీటీసీ పంతులు వెంకన్న బాబు, వైసీపీ నాయకులు కొరిపల్లి శ్రీనివాసరావు, నక్కా శ్రీను, బళ్ల త్రిమూర్తులు, పాతూరి శ్రీనివాసరాజు, అడపా శ్రీను, మిద్దే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల పంటలకు భద్రత కల్పిస్తాం

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : నియోజకవర్గంలో త్వరితగతిన గోదాంలను పూర్తిచేసి రైతుల పంటకు భద్రత కల్పించే దిశగా చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. పెదవేగి మండలం లక్ష్మీపురంలో వ్యవసాయ మార్కెట్‌యార్డ్ కమిటీ మొదటి సాధారణ సమావేశం గురువారం నిర్వహించారు. యార్డ్ చైర్మన్ అప్పన కనక దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొన్నారు. ఏఎంసీకి వచ్చిన ఎమ్మెల్యేకు యార్డ్ బోర్డ్ సభ్యులు పుష్పగుచ్ఛంతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అతి ముఖ్యమైంది వ్యవసాయ మార్కెట్‌యార్డ్ అని ఇది రైతాంగానికి చాలా ప్రాముఖ్యమైందన్నారు. దీన్ని అభివృద్ధి చేస్తూ, రైతాంగానికి ఏమైనా కష్టం వస్తే మార్కెట్ యార్డ్ చైర్మన్‌కి గాని, బోర్డు సభ్యులకు చెప్పుకునే చక్కటి పరిస్థితిని తీసుకురావడానికి రైతుకు అండగా నిలబడి రైతును మహరాజులా చూసుకునే పరిస్థితి తీసుకురావాలని ఆయన చెప్పారు. దెందులూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 137 పుంత రోడ్లకు గాను రూ. 8 కోట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ బిల్డింగ్ చక్కటి నిర్మాణానికి రూ. 50 లక్షల నిధులతో జనవరి లోపు భవనం పూర్తి చేస్తామన్నారు. యార్డ్‌లో భారీవాహనాల రాకపోకలకు రైతుల సౌకర్యార్థం సీసీ రోడ్లకు రూ.50 లక్షలు, ప్రహరీ గోడకు రూ 50లక్షలు, వాటర్ ప్లాంట్‌కు రూ. 4 లక్షల నిధులు మంజూరు చేశామని, జనవరి నాటికి పూర్తి చేస్తామన్నారు. అనంతరం యార్డులో గత కొంత కాలం క్రితం అక్కినేని ఆదినారాయణ అనే హమాలీ కూలి గుండెనొప్పితో మరణించగా అతని భార్య రంగరాణికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చేతుల మీదుగా రూ. లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. వైస్‌చైర్మన్ కాటి సుధాకర్, బోర్డు సభ్యులు పులిపాటి శ్యామలదేవి, కంబంపాటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కొసరాజు రత్నకుమారి, దేవళ్లరాజు రాజశేఖర్, షేక్ మీరా, నాగులపల్లి రంగారావు, పామర్తి నాగజ్యోతి, తోట హేమలత, నళినీకుమారి, కొండే జోజిలత, ఆవల లీలావతి, కట్నేని తులసిరామ్, పసుపులేటి రాజేష్, గోపన్నపాలెం సర్పంచ్ కె నాగ మల్లేశ్వరి, ఎండీవీ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్‌లు, హమాలీలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన సమస్యలు పరిష్కరిస్తా



వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ప్రాధాన్యత క్రమంలో నియోజకవర్గ ప్రజల సమస్యలు, స్పందనలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో దెందులూరు, పెదవేగి మండలాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన సమస్యల వినతి పత్రాలను తీసుకుని సంబంధిత శాఖల అధికారుల పరిష్కారానికి సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, పెదవేగి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డు సతీష్ చౌదరి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్యంలో భాగస్వాములు కావాలి



గణపవరంలో చెత్తడబ్బాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: సంపూర్ణ పారిశుద్ధ్యంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములై ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం గణపవరం పంచాయతీ కార్యాలయంవద్ద స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ్-2023 కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తడి, పొడి చెత్తలను వేయడానికి డస్ట్‌బిన్‌లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిపొడి చెత్తలను వేర్వేరుగా వేసి, ప్రతీ రోజు ఇంటింటికి వచ్చే చెత్తబండిలో వేయాలని సూచించారు. చెత్త ద్వారా సంపదకోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ఇంటింటికి వెళ్లి చెత్తసేకరణకు ప్రభుత్వం చేస్తున్న కృషికి అందరూ సహకరించడం ద్వారా ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ఈసందర్భంగా సుమారు 60వేల చెత్తడబ్బాలను ఆయన పంపిణీ చేశారు. రాష్ట్ర సూర్య బలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, ఎంపీపీ అర్ధవరం రాము, వైస్ ఎంపీపీ సలాది దుర్గా రత్నకుమారి, జెడ్పీటిసి దేవారపు సోమలక్ష్మిబాబులు, సొసైటీ అధ్యక్షుడు కొనిశెట్టి రమేష్, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దండు రాము, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్‌జానీ, పార్టీ నాయకులు నడింపల్లి సోమరాజు, తెనాలి సునీల్, మండల సర్పంచ్‌ల ఛాంబర్ చైర్మన్ చనుమూరి దుర్గాభవాని, ఎంపీడీవో జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

12వేల ఎకరాలకు పోలవరం కాల్వ ద్వారా సాగునీరు



పోలవరం కాల్వ నీరు దెందులూరు చేరిన దృశ్యం

దెందులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో దెందులూరు మండలంలోని 12 వేల ఎకరాల సాగునీటి సమస్య తొలిగింది. మండలంలోని సోమవరప్పాడు, ఉప్పుగూడెం, అలుగులగూడెం, సానిగూడెం, దెందులూరు, సత్యనారాయణపురం, కొమిరేపల్లి, సీతంపేట గ్రామాల్లోని 12 వేల ఎకరాలకు సాగునీరు అందేలా ప్రజాప్రతినిధులు చేసిన కృషి తీసుకున్న నిర్ణయం స్ఫూర్తిదాయకమని జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, దెందులూరు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, దెందులూరు వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షులు పోకల రాంబాబు, కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, దెందులూరు ఎఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి హర్షం వ్యక్తం చేశారు. గురువారం దెందులూరు మండలానికి చేరిన పోలవరం కాల్వ నీటిని ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, దెందులూరు వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు మాట్లాడుతూ మండలంలోని 12 వేల ఎకరాల ఆయుకట్టు రైతులు, రైతు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామన్నారు. గతంలో సీతంపేట ఆయుకట్టు రైతాంగం సాగునీటి కోసం ప్రతి ఏడాది నీటిపోరాటాలు, యుద్ధాలు చేయాల్సి వచ్చేదని, అలా చేసినా కూడా సాగునీరు వచ్చేది కాదన్నారు. కొన్నేళ్లు అయితే పంటలు కూడా పండించని దుస్థితి ఈ ప్రాంతంలో ఉందన్నారు. విద్యావంతుడు ఈ ప్రాంత రైతులు, రైతు కుటుంబ సభ్యుల జీవన విధానం, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకున్న సీనియర్ నేత ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు కృషిని తాము ఎన్నటికి మరువలేమన్నారు.